www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 8 డిసెంబర్ 2025

5

పశ్చిమ గోదావరి



1100 సేవలు వినియోగించుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా సమస్యల పరిష్కారానికి మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయొచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

శవాలను పీక్కుతింటున్నారు..!

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పోస్టుమార్టం విభాగంలో ఘోరం

చనిపోయిన వ్యక్తికి పోస్టుమార్టం చేయాలంటే సొమ్ము కట్టాల్సిందే

రూ. 5 వేలు ఇస్తేనే పోస్టుమార్టం..లేకపోతే లేదంటున్న పరిస్థితి

జిజిహెచ్‌లో నెలకు దాదాపు 45 మృతదేహాలకు పోస్టుమార్టం

దిక్కుతోచని స్థితిలో కుటుంబీకులు, బంధువులు



ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసే విభాగం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఏలూరు సర్వజన ఆసుపత్రి పోస్టుమార్టం విభాగంలో అత్యంత దారుణమైన పరిస్థితి కొనసాగుతోంది. తమ ధన దాహానికి మృతదేహాలను సైతం వదలని పరిస్థితి నెలకొంది. జాలి, దయ అనేది లేకుండా నిబంధనలకు విరుద్ధంగా చనిపోయిన వ్యక్తికి పోస్టుమార్టం చేసేందుకు అక్కడి వైద్యులు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పుట్టెడు బాధలో ఉన్న కుటుంబీకులు వైద్యుల తీరు చూసి ఇదేం దారుణమంటూ కన్నీరుమున్నీరవుతున్నారు. నిరుపేదల కుటుంబీకులైతే అడిగినంత డబ్బు సమకూర్చలేక నానాయాతన పడుతున్న పరిస్థితి కొనసాగుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎంతో పేరుగాంచిన ఏలూరు జిల్లా ఆసుపత్రి బోధనా ఆసుపత్రి (మెడికల్ కాలేజీ)గా మారిన తర్వాత అక్కడి పరిస్థితులు అత్యంత దారుణంగా మారాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు, పురుగుల మందు తాగిన కేసులు ఎక్కువగా ఏలూరు సర్వజన ఆసుపత్రికి వస్తుంటాయి. చికిత్స అందించినప్పటికీ ఒక్కోసారి పరిస్థితి వికటించి మరణిస్తున్నారు. అలా మృతి చెందిన కేసుల్లో పోస్టుమార్టం తప్పనిసరి అవుతోంది. మృతుడు స్వస్థలానికి సంబంధించిన విఆర్ఒ, సంబంధిత మండలానికి చెందిన పోలీసులు వచ్చి శవ పంచనామా చేసి రిపోర్ట్‌ను తయారు చేస్తారు. అనంతరం ఆసుపత్రిలోని వైద్యులు పోస్టుమార్టం చేయడం జరుగుతోంది. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు పోస్టుమార్టానికి సంబంధించి ఎటువంటి ఇబ్బందీ ఉండేది కాదు. బోధనా ఆసుపత్రిగా మారిన తర్వాత పరిస్థితి ఘోరంగా తయారైందంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. పోస్టుమార్టం చేసేందుకు చనిపోయిన వ్యక్తి కుటుంబం నుంచి రూ.ఐదు వేల వసూలు చేయడం అంతటా హాట్‌టాపిక్‌గా మారింది. అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే పోస్టుమార్టం చేసేందుకు రాకుండా వైద్యులు మొరాయిస్తున్నట్లు మృతుని బంధువులు చెబుతున్న పరిస్థితి. ఆసుపత్రి లెక్కల ప్రకారం ప్రతినెలా 45 నుంచి 50 వరకూ పోస్టుమార్టాలు జరుగుతున్నాయి. ఒక్కో మృతదేహానికి రూ.ఐదు వేలు వసూలు అంటే దాదాపు రూ.2.50 లక్షలకుపైగా వసూళ్ల ప్రక్రియ సాగుతోంది. ఇదంతా యథేచ్ఛగానే సాగిపోతోంది. మామూలుగా అయితే పోస్టుమార్టం చేసిన తర్వాత మృతదేహాన్ని ప్యాక్ చేయడానికి చాప వంటి కొన్ని వస్తువులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అందుకు సంబంధించి రూ. 1500 వరకూ ఖర్చవుతోంది. అక్కడి వరకూ ఇవ్వడానికి పెద్దగా ఇబ్బంది లేదు. పోస్టుమార్టం చేసే వైద్యులకు రూ.ఐదు వేలు ఎందుకివ్వాలన్న ప్రశ్న అందరినీ వెంటాడుతోంది. డబ్బులు ఇవ్వకపోతే పోస్టుమార్టం ఆలస్యం కావడం, తర్వాత డెత్ సర్టిఫికెట్ ఇవ్వరన్న భయంతో డబ్బులు ఇస్తున్న పరిస్థితి నెలకొంది.

పోలీసులతో ఒత్తిడిచేసి వసూలు

పోస్టుమార్టం చేసే వద్ద వసూలు అంతా అక్కడికొచ్చిన పోలీసులతోనే వైద్యులు చేయిస్తున్నారంటూ చర్చ సాగుతోంది. ఏదైనా మృతదేహానికి సంబంధించిన ప్రక్రియలో ఎస్ఐ, లేకపోతే ఎఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్ ఎవరో ఒకరు హాజరు కావాల్సి ఉంటుంది. అనేక పని ఒత్తిళ్ల కారణంగా కొన్నిసార్లు ఎస్ఐలు రాలేకపోతున్న పరిస్థితి కొనసాగుతోంది. చనిపోయిన కుటుంబం నుంచి డబ్బులు వసూలు చేసి ఇచ్చే బాధ్యత పోలీసులకే వైద్యులు అప్పగిస్తున్న పరిస్థితి నెలకొంది. ఒకవేళ పోలీసులు నిరాకరిస్తే ఎస్ఐను తీసుకురండని, లేకపోతే ఏదో ఒక కాగితం లేదంటూ ఇబ్బంది పెడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులకు సైతం ఏంచేయాలో తెలీక పోస్టుమార్టం చేసే వైద్యులకు డబ్బులు ఇవ్వాలంటూ చనిపోయిన కుటుంబ సభ్యులపై ఒత్తిడి చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. డబ్బులు ఇవ్వపోతే పోస్టుమార్టం ప్రక్రియ నిలిచిపోతుందన్న భయం కుటుంబీకులను వెంటాడుతోంది. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పనిచేసే వైద్యులకు రూ. లక్షల్లో వేతనాలు ఉంటాయి. అయినప్పటికీ మృతదేహాలకు పోస్టుమార్టంలో డబ్బులు వసూలు చేయడం అందరినీ తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. మృతదేహం ప్యాక్ చేయడానికి రూ. రెండు వేలు, పోస్టుమార్టం చేసినందుకు రూ.ఐదు వేలు తప్పనిసరిగా కట్టాల్సిన పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. పోస్టుమార్టం చేసేవద్ద ఎవరికీ డబ్బులు ఇవ్వక్కర్లేదని బోర్డులు పెట్టి, ఎవరైనా డబ్బులు అడిగితే ఈ నెంబర్‌కు ఫిర్యాదు చేయండని అక్కడి అధికారులు ఎందుకు చేయడంలేదో అర్థంకావడం లేదు. సామాన్య కుటుంబీలకు చెందిన వారైతే డబ్బులు కట్టలేకపోతున్నారు. దీంతో ఊళ్లో గ్రామ పెద్దలు డబ్బులు చెల్లించి మృతదేహాన్ని తీసుకెళ్తున్న పరిస్థితులు కొనసాగుతున్నాయి. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. దీనిపై ఏలూరు సర్వజన ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ హనుమాన్ నాయక్‌ను డబ్బులు వసూలుపై వివరణ కోరగా సూపరింటెండెంట్ వచ్చాక తెలియపరుస్తామని, పోస్టుమార్టానికి డబ్బులు కట్టనవసరం లేదని ఆయన తెలిపారు.

డబ్బులు వసూలు చేయడం తప్పు

పి.సావిత్రి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్

డబ్బులు వసూలు చేస్తున్నట్లు నా దృష్టికి రాలేదు. పోస్టుమార్టానికి డబ్బులు వసూలు చేయడం తప్పు. పోస్టుమార్టం అంతా ఉచితంగా చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రిలో ఈసేవలన్నీ ఉచితమే. దీనిపై తెలుసుకుంటాను.

బస్టాండుల్లో మౌలికవసతులపై ప్రత్యేక దృష్టి

- మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం కల్పనకు చర్యలు
- గతేడాదితో పోలిస్తే పెరిగిన ఆక్యుపెన్సీ
- జిల్లాలో రోజుకు 270 ఆర్‌టిసి బస్సుల్లో లక్షా ఇరవై మంది ప్రయాణం
- జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్





ప్రజాశక్తి - భీమవరం

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్‌టిసి బస్టాండుల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ తెలిపారు. ప్రయాణికులు సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు చర్యలు చేపట్టమన్నారు. ముఖ్యంగా మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం మరింత మెరుగుదలకు చర్యలు ముమ్మరం చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 270 ఆర్‌టిసి బస్సులు నడుపుతున్నామని, దీనిలో రోజూ లక్షా ఇరవై వేల మంది ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. రోజుకు సరాసరి రూ.49 లక్షల ఆదాయం లభిస్తోందన్నారు. జిల్లాలో ఉన్న బస్టాండ్ల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ఉచిత బస్సు ప్రయాణం, ఆర్‌టిసి ఆదాయం తదితర విషయాలను ప్రజాశక్తి నిర్వహించిన ముఖాముఖిలో జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి వరప్రసాద్ వివరించారు.

ప్రశ్న : జిల్లాలో ఆర్‌టిసి డిపోలు ఎన్ని ఉన్నాయి? ఎన్ని బస్సులు నడుపుతున్నారు?

డిపిటిఒ : భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురంలో నాలుగు ఆర్‌టిసి డిపోలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రధానంగా 33 రూట్లలో 270 బస్సులు నడుపుతున్నాం. దీనిలో మహిళలకు ఉచిత ప్రయాణానికి సంబంధించి పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు 224 నడపడం జరుగుతుంది. అలాగే సుమారు 20 స్కూల్ బస్సులు ఖాళీ సమయంలో జిల్లా వ్యాప్తంగా వివిధ రూట్లల్లో సర్వీసులు నడుపుతున్నాం.

ప్రశ్న : ఆర్‌టిసి బస్సుల్లో రోజుకు ఎంతమంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు? ఎంత ఆదాయం ఆర్జిస్తున్నారు?

డిపిటిఒ: జిల్లా వ్యాప్తంగా రోజుకు లక్షా ఇరవై వేల మంది ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. దీనిలో మహిళలు 82 వేల మంది, పురుషులు 38 వేల మంది ప్రయాణం సాగిస్తున్నారు. రోజుకు సగటున రూ.49 లక్షలు ఆదాయం సమకూరుతోంది. దీనిలో టికెట్ల ఆధారంగా రూ.24 లక్షలు, మహిళలకు ఉచిత బస్సు పేరుతో మరో రూ.25 లక్షల ఆదాయం వస్తుంది. ఆదాయం పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : మహిళా ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఎటువంటి సౌకర్యాలు కల్పించారు?

డిపిటిఒ: మహిళా ప్రయాణికుల రద్దీ పెరిగిన నేపథ్యంలో వారికి ఇబ్బందులు కలగకుండా ఇప్పటికే అన్ని చర్యలూ చేపట్టాం. ముఖ్యంగా బస్టాండ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. మరుగుదొడ్లు, తాగునీరు, ఫ్యాన్లు వంటి సౌకర్యాలు కనిపించాం. ఎక్కడా ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

ప్రశ్న : బస్టాండ్ల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు తీసుకున్న చర్యలు ఏమిటి?

డిపిటిఒ: జిల్లాలోని బస్టాండ్లలో మౌలికవసతుల కల్పనపై ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. మరుగుదొడ్ల నిర్మాణం, ఇతర మౌలిక సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాం. ఉండి బస్టాండ్‌లో రూ.10 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాం. తాడేపల్లిగూడెం బస్టాండ్‌లో రూ.8 లక్షలు, పాలకొల్లులో రూ.10 లక్షలతో నిర్మించిన టాయిలెట్లను త్వరలో ప్రారంభించనున్నాం. తణుకులో రూ.15 లక్షలు, గణపవరం బస్టాండ్‌లో రూ.5 లక్షలతో మరుగుదొడ్లు నిర్మించేందుకు టెండర్లు పిలవాల్సి ఉంది. అలాగే గతంలో నరసాపురంలో, ఇటీవల భీమవరంలో రూ.11 లక్షలతో నిర్మించిన అభివృద్ధి పనులను ఇప్పటికే ప్రారంభించాం. మరో రెండు మూడు నెలల్లో చేపట్టిన పనులన్నీ పూర్తిచేసే విధంగా అన్ని చర్యలూ తీసుకున్నాం.

ప్రశ్న : గతంతో పోలిస్తే ఆక్యుపెన్సీ ఏ విధంగా ఉందంటారు?

డిపిటిఒ: గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆక్యుపెన్సీ బాగా పెరిగింది. గతేడాది ఆగస్టులో 71, సెప్టెంబర్‌లో 80, అక్టోబర్లో 82, నవంబర్లో 86 ఆక్యుపెన్సీ ఉంది. ప్రతి బస్సులో ప్రతి 100 సీట్లలో 86 వరకూ ప్రతిరోజు ఫిల్ అవుతున్నాయి.

విద్యా పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్


మాట్లాడుతున్న రామ్మోహన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రభుత్వ విద్యా పరిరక్షణకు విద్యార్థులందరూ ఐక్య ఉద్యమాలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ పిలుపునిచ్చారు. స్థానిక చుక్క అప్పలస్వామి (అపర అండ్ ఫ్లోర్ మిల్లు వర్కర్స్ యూనియన్) హాల్లో 47వ జిల్లా మహాసభ ఆదివారం రెండో రోజు కొనసాగింది. ఈ సభకు ఎస్ఎఫ్ఐ నాయకులు గణేష్, సాయికృష్ణ, సింధు, రోహిత్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. తొలుత మహాసభ ప్రారంభ సూచికగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు స్వాతంత్రం ప్రజాస్వామ్యం, సోషలిజం ఆశయాలతో కూడిన జెండాను ఎగురవేశారు. స్వాతంత్ర పోరాట వీరులు భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, బిఆర్.అంబేద్కర్, ఇటీవల గంజి గుండాల చేతిలో మరణించిన డివైఎఫ్ఐ, ప్రజానాట్య మండలి కళాకారుడు పెంచలయ్య చిత్రపటాలకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా గర్ల్స్ కమిటీ కన్వీనర్ సింధు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్, గణేష్, లక్ష్మణ్, శ్రీను, వాసు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు 55 సంవత్సరాల నుంచి ఎస్ఎఫ్ఐ నికరంగా పోరాటాలు చేస్తోందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం వివిధ దశల్లో ఆందోళనలు, పోరాటాలు చేయడంలో ఎస్ఎఫ్ఐ ముందు నిలిచిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తున్నాయన్నారు. వాటికి వ్యతిరేఖంగా విద్యార్థులందరూ ఐక్యమై పోరాడాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు గుదిబండగా ఉన్న జిఒ 77ను తక్షణం రద్దు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,100 కోట్ల ఫీజ్ రియంబర్స్ మెంట్ బకాయిలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు సమస్యల వలయంలో చదువులు సాగిస్తున్నారన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనాలు తక్షణం నిర్మించాలన్నారు. పీజీ కళాశాలల్లో అన్ని రకాల కోర్స్‌లు లేక విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. పాఠశాలలు, కళాశాలల సమయాలకు అనుగుణంగా ఆర్‌టిసి విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. అనంతరం ప్రతినిధులందరూ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బి.గణేష్, కార్యదర్శిగా టి.ప్రసాద్ ఉపాధ్యక్షులుగా సింధు, నాగేంద్ర, లక్ష్మణ్, ఈశ్వర్, సహాయ కార్యదర్శి శ్రీను, రోహిత్, ఎన్నికయ్యారని, మరో 15 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారని తెలిపారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యసాధనకు భాగస్వాములు కండి

విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఉత్సాహంగా సాగిన 'తణుకు రోడ్ రన్'


రోడ్ రన్‌లో మంత్రి, కలెక్టర్, ఎస్‌పి, ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తణుకు

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యసాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. తణుకు రోడ్డు రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యాన ఆదివారం తణుకులో నిర్వహించిన తణుకు రోడ్ రన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి రవికుమార్ మాట్లాడుతూ.. తణుకు చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద రన్నర్స్ సొసైటీ భాగస్వామ్యంతో స్థానిక ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రవికుమార్ మాట్లాడుతూ.. శారీరక ధృఢత్వం, మంచి ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కేవలం ఒక్కరోజు మాత్రమే కాకుండా ఇదే రోజున స్ఫూర్తిగా తీసుకుని ప్రతిరోజు ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఆయన కోరారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంకల్పించిన ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా తణుకు రన్నర్ సొసైటీ భాగస్వామ్యంతో తణుకులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నంలోని దేశంలో ఎక్కడా జరగని విధంగా ఐదు లక్షల మందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరిగిందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంకల్పించిన ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యసాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. ప్రతి ఇల్లు, గ్రామం, పట్టణం పరిశుభ్రంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయమని చెప్పారు. ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని శారీరక ధృడత్వం, ఆరోగ్యం కోసం కేటాయించాలని సూచించారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ.. తణుకు రోడ్డు రన్ కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొనడం హర్షించదగిన విషయమన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని కోరారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నెల రోజులపాటు గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతిరోజు యోగా కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరిగిందని గుర్తుచేశారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా తణుకులో ఇలాంటి కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతిరోజు యువత శారీరక ధృఢత్వం కోసం కొంత సమయాన్ని కేటాయించాలని కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ తణుకు రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యాన 3కె, 5కె, 10కె విభాగాల్లో రోడ్డు రన్ కార్యక్రమం నిర్వహించుకోవడం జరిగిందన్నారు. తణుకు పట్టణం క్లీనర్, గ్రీనర్, హెల్దియర్‌గా ఉండడంతో పాటు ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం రెండోసారి నిర్వహించుకోవడం జరిగిందని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాన్ని సైతం ప్రతిపక్ష నాయకులు రాజకీయం చేయడం బాధాకరమన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి తన వంతు సహకారం అందిస్తానని ఎంఎల్ఎ రాధాకృష్ణ హామీ ఇచ్చారు. అంతకుముందు మూడు విభాగాల్లో రోడ్ రన్ కార్యక్రమాలను ప్రారంభించి వారితోపాటు రోడ్ రన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, ఔత్సాహకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భానో, తణుకు మున్సిపల్ కమిషనర్ టి.రామ్ కుమార్, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాలకొల్లును అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుదాం

జల వనరుల శాఖా మంత్రి రామానాయుడు


అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలోనే పాలకొల్లు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లి ఆదర్శంగా నిలిపేలా అధికారులంతా పనిచేయాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో ఆదివారం మంత్రి కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాలకొల్లు నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులపై మున్సిపల్, టూరిజం, పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్, టిడ్కో, ఎల్‌అండ్‌టి, ఇరిగేషన్ శాఖలకు సంబంధించి అధికారులతో మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలతో వేగంగా జరిగేలా చూడాలన్నారు. పేదలు, మహిళల సొంతింటి కల నెరవేర్చేందుకు మిగిలిన టిడ్కో గృహాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పట్టణంలో రూ.3 కోట్లతో గౌడ శెట్టిబలిజ కళ్యాణ మండపం, రామగుండం ఉద్యానవనం, ఎన్‌టిఆర్ కళాక్షేత్రం, అబ్దుల్ కలాం ఉద్యానవనం, ముస్లిం షాదీ ఖానా, అంబేద్కర్ కమ్యూనిటీ భవనం వంటి వాటిలో పనులు పూర్తి చేయాలన్నారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో పాలకొల్లు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

జాతీయ స్థాయి ఈత పోటీలకు జోత్స్నశ్రీ



ప్రజాశక్తి - వీరవాసరం

ఈనెల 27వ తేదీన హైదరాబాద్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి ఈత పోటీలకు వీరవాసరం మండలానికి చెందిన కోరశిఖ జోత్స్న ఎంపికైనట్లు ఆమె తండ్రి కోరశిఖ వీర్రాజు ఆదివారం తెలిపారు. ఎపి స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధర్యాన నరసారావుపేట స్విమ్మింగ్‌పూల్‌లో 7వ తేదీన నిర్వహించిన వాటర్‌పోల్‌లో పాల్గొని ఆమె అర్హత సాధించనట్టు ఆమె తండ్రి తెలిపారు. తనతో పాటు మరో పదకొండు మంది ఆంధ్రప్రదేశ్ నుండి ఎంపికైనట్టు జోత్స్న తెలిపింది. వీరంతా సౌత్‌జోన్ తరుపున జాతీయ స్థాయి ఈత పోటీల్లో పాల్గొనడం జరుగుతుందని జోత్స్న తెలిపింది. జోత్స్న స్వస్థలం వీరవాసరం మండలం పెర్కిపాలెం గ్రామం. ప్రస్తుతం జోత్స్న భీమవరం తిరుమల కళాశాలలో మొదటి సంవత్సర బైపిసి చదువుతుంది.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలదే

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు


మాట్లాడుతున్న మంతెన సీతారాం

ప్రజాశక్తి - పాలకొల్లు

దేశంలో న్యాయమైన సమ సమాజాన్ని నిర్మించాలని అంబేద్కర్ భావించారని, ఆయన బోధనలు, పోరాటం నేటికీ సమాజానికి మార్గ నిర్దేశం చేస్తూనే ఉన్నాయని, అయితే కొందరు అంబేద్కర్ సిద్ధాంతాలను కాల రాస్తున్నారని రాజ్యాంగ ప్రచార వేదిక రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పాలకొల్లు త్యాగరాజ భవనంలో 'అంబేద్కర్ స్ఫూర్తి - రాజ్యాంగ విలువలు' అంశంపై ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల నేతలు పాల్గొన్నారు. పాలకొల్లు రాజ్యాంగ ప్రచార వేదిక సారథ్యంలో సమావేశం జరిగింది. మంతెన సీతారాం మాట్లాడుతూ రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని కోరారు. లౌకిక విధానం సోషలిజం గురించి నేటి యువతకు తెలియపర్చాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ సార్వభౌమాధికారానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నాయని, రాజ్యాంగానికి వ్యతిరేకంగా లౌకికవాద వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని తెలిపారు. సోషలిస్టు నేత పెన్మెత్స సుబ్బరాజు మాట్లాడుతూ మనలను పాలిస్తున్న నాయకుల్లో రాజ్యాంగం చదివిన వారు ఎందరు అని ప్రశ్నించుకోవాలన్నారు. అంబేద్కర్‌పై సోషల్ మీడియాలో ఎక్కువగా దాడి జరుగుతోందన్నారు. ఈ దాడిని ఖండించాలని, రాజ్యాంగానికి సంబంధించి విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ దేశంలో ప్రజలను సమానంగా చూడాలనే భావన పాలకులకు లేదన్నారు. రాజ్యాంగాన్ని ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. లౌకిక వాదనను పీఠికలో పొందుపర్చినా ఈ దేశంలో అమలు చేయడం లేదన్నారు. ఒక శాతం కార్పొరేట్ల చేతుల్లో 60 శాతం దేశ సంపద ఉందని, విద్య కూడా వేల సంవత్సరాల నుంచి బలహీన వర్గాలకు నిషేధించబడిందని, రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాతే విద్య అందరికీ అందుబాటులో ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం మోడీ రాజ్యాంగం మార్చాలని చూస్తున్నారని, ప్రజా సంఘాలు, మేధావులు ఆలోచించాలని రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు గుమ్మపు సూర్య ప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం మేధావులను అడ్డుపెట్టుకుని లౌకిక రాజ్యాన్ని మత ప్రాతిపదికన విభజించి మాట్లాడుతున్నారని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వంగా నరసింహారావు అన్నారు. రాజ్యాంగంలో అన్ని హక్కులూ, బాధ్యతలూ ఉన్నాయని సీనియర్ న్యాయవాది జివి సుబ్బారావు అన్నారు. సీనియర్ ఉపాధ్యాయ నేత పోలిశెట్టి గోఖలే, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నేత బాతిరెడ్డి జార్జి మాట్లాడారు. సమావేశం నిర్వహణకు యర్రా అజయ్, కెవి రాయపరాజు కృషి చేశారు. యుటిఎఫ్ నేత రాంజీ అంబేద్కర్, జెవివి నేత రామ లక్ష్మణ్, చల్లా సోమేశ్వరరావు మాట్లాడారు.

సిఐటియు ఆలిండియా మహాసభను జయప్రదం చేయాలి

జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్


ప్రజాశక్తి - తణుకు

కార్మికుల పక్షాన సమరశీల పోరాటాలు చేస్తున్న సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అమరవీరుల భవనంలో సిఐటియు మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు ఈనెల 31 నుండి జనవరి 3 వరకు జరుగతున్న నేపథ్యంలో పోస్టర్లు, స్టిక్కర్లు ఆవిష్కరించారు. ఈ నెల 15న మహాసభల ప్రారంభ సూచికగా అన్ని యూనియన్స్ వద్ద జెండాలు ఆవిష్కరించాలన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మిక వ్యతిరేక విధానాలు విడనడాలని, ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రయివేటీకరణ ఆపాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, మండల కన్వీనర్ గుబ్బల గోపి మాట్లాడుతూ.. కార్మికవర్గ రాజ్యం కోసం సిఐటియు కృషి చేస్తుందన్నారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుండి నేటి వరకు సంపద సృష్టిస్తున్న కార్మికుల పట్ల పాలకులు చిన్న చూపు చూస్తున్నారని విమర్శించారు. 1970లో సిఐటియు ఏర్పడిన నాటి నుండి నేటి వరకు కార్మికుల పక్షాన నికరంగా పోరాటం చేస్తుందన్నారు. నేటి పాలకులు, కార్మికులకు మరెన్నో ప్రయోజనాలు కల్పించడం మానేసి, ఉన్న 29 చట్టాలు రద్దు చేసి 4 లేబర్ కోడ్స్‌గా చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. గతంలో ఉన్న అన్ని హక్కులు కార్మికులు లేబర్ కోడ్స్ వల్ల కోల్పోతున్నారని తెలిపారు. కేంద్రంలో ఉన్న బిజెపి కార్మికులకు హక్కులు లేకుండా, కార్పొరేట్లు దోచుకోవడానికి వీలుగా చట్టాలు మార్చారన్నారు. సిఐటియు మహాసభలలో కార్మికులు సమస్యల పరిష్కారానికి చర్చించడం జరుగుతుందని తెలిపారు. జనవరి 4న విశాఖలో బహిరంగ సభకు కార్మికులు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్మికులు అనుకూలమైన చట్టాలు చేసే వరకు పోరాటాలు ఆగవని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎ.అజయకుమారి, గార రంగారావు, అందే శ్రీనివాస్, ప్రసాద్, సాయి, బాలాజీ, బోస్ పాల్గొన్నారు.

గోదావరి మధ్యలో నిలిచిన పంటు

ప్రయాణికుల ఆందోళన

ప్రజాశక్తి - నరసాపురం


గోదావరిలో నిలిచిన పంటు

సాంకేతిక సమస్యతో వశిష్ట గోదావరి నది మధ్యలోనే సుమారు అరగంటసేపు ప్రయాణికులు, వాహనాలతో పంటు ఆగిపోయింది. సఖినేటిపల్లి, నరసాపురం మధ్య ఉన్న రేవు నుంచి నిత్యం వేలాది మంది పంటుపై రాకపోకలు సాగిస్తారు. ఆదివారం ఉదయం నరసాపురం వైపు నుంచి సఖినేటిపల్లి రేవుకు వెళ్తున్న పంటు సాంకేతిక సమస్యలతో సుమారు అరగంటసేపు గోదావరి మధ్యలోనే ఆగిపోయింది. పంటులో ప్రయాణిస్తున్న ప్రయాణికులందరూ ఆందోళనకు గురయ్యారు. నిర్వాహకులు మరొక పంటుకి తాడు కట్టి సఖినేటిపల్లి ఒడ్డుకి తీసుకొని రావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన సమయంలో పంటులో సుమారు 80 మంది వరకూ ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఆదివారం కావడంతో కోనసీమ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అంతర్వేదికి పెద్ద ఎత్తున భక్తులు ఈ మార్గంలో ప్రయాణిస్తారు. కనీస ప్రమాణాలు కూడా పాటించకుండా పంటును నిర్వాహకులు నిర్వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు కనీసం రక్షణ చర్యలు ఏవిధంగా ఉన్నాయని పట్టించుకోకుండా పంటు పాటదారులకు వత్తాసు పలుకుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల గోదావరిలో నరసాపురం వైపు వెళ్తున్న పంటు అలలు ఉధృతకు ఊగిసలాడిన వీడియో సోషల్ మీడియాలో హల్చల్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

శ్మశానవాటిక వద్ద షవర్లు ఏర్పాటు

ప్రజాశక్తి - పాలకోడేరు

మారుతున్న కాలానికి అనుగుణంగా మానవ జీవితం రాను రాను కష్టంగా మారుతుంది. ఈ కష్టాలు జీవిస్తున్నప్పుడే కాకుండా చనిపోయాక కూడా తప్పట్లేదు. మృతిచెందిన వారిని శ్మశానానికి తీసుకెళ్లేందుకు అనేక వ్యయ ప్రయాసలు ఎదుర్కొంటున్న పరిస్థితి నేడు అనేక చోట్ల ఉంది. ఇది ఇలా ఉంటే మృతదేహానికి దహన సంస్కారాలు చేసేందుకు కూడా వెళ్లిన వారికి కష్టాలు తప్పట్లేదు అంటే అతిశయోక్తి కాదు. చనిపోయిన వారిని దహన సంస్కారాలు చేశాక స్నానం చేయాల్సి ఉన్న నేపథ్యంలో స్థానికంగా సరైన సౌకర్యాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉంది. ఈనేపథ్యంలో మోగల్లు గ్రామ సర్పంచి మల్లిపూడి కృష్ణకుమారి శ్రీనివాస్ వినూత్నంగా ఆలోచించారు. గ్రామంలో ఎవరైనా చనిపోయిన దహన సంస్కారాలు పూర్తి అయిన తర్వాత స్నానాలు ఆచరించేందుకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో షవర్లు, కుళాయిలు ఏర్పాటు చేశారు. గ్రామంలో రెండు చోట్ల పంచాయతీ నిధులు రూ.10 లక్షలతో వీటిని ఏర్పాటు చేయడం జరిగింది. వీటిని ఆదివారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి దీర్ఘకాలంగా ఉన్న సమస్యను సర్పంచి మల్లిపూడి కృష్ణకుమారి శ్రీనివాస్ పరిష్కరించడంతో గ్రామస్తులంతా సర్పంచి దంపతులను అభినందిస్తున్నారు.

ఆక్రమణల తొలగింపులో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం పట్టణంలోని వీరమ్మ పార్కు రైతు బజార్, కొత్త బస్ స్టాండ్, రైల్వే జంక్షన్, ప్రకాశం చౌక్, జెపి రోడ్డు ప్రాంతాల్లో ఆదివారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ కోర్టుల ఏర్పాటు, ఆక్రమణల తొలగింపు, ట్రాఫిక్ నియంత్రణ, కూరగాయల ధరలు నియంత్రణ విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జెసి పట్టణంలో ఉన్న వీరమ్మ పార్క్ అంతా కలియ తిరిగి పరిశీలించారు. పార్కు లోపల లైటింగ్ పెట్టి ఇంకా బాగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. పార్కు లోపల ఫుడ్ కోర్టును పరిశీలించి వ్యాపారం ఎలా జరుగుతున్నది, ఇంకా బాగా అభివృద్ధి చేయాలని నిర్వాహకులకు సూచించారు. అక్కడే ఉన్న పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. పని చేసే సమయంలో భోజనాలు, మాస్కులు, ధరించాలని సూచించారు. కొత్త బస్టాండ్ ప్రాంతంలో రోడ్డు మీదకు షెడ్లు నిర్మించి ఉన్న ఆక్రమణలు వెంటనే తొలగించాలి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రైల్వే జంక్షన్ ఫ్లై ఓవర్ వద్ద డంపింగ్ చేస్తున్న చెత్తనంతా తొలగించి క్లీన్ అండ్ గ్రీన్ చేయాలని ఆదేశించారు. ప్రకాశం చౌక్ వద్ద పెట్రోల్ బంకు ప్రాంతంలో తొలగించిన ఆక్రమణ ప్రాంతమంతా క్లీన్ చేసి పార్కుల అభివృద్ధి చేయాలన్నారు. చికెన్ షాపుల వ్యర్థాలు పాడేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జువ్వలపాలెం రోడ్డు, రాయలం డ్రెయిన్ రోడ్డు, ఫుడ్ కోర్ట్ ఏర్పాటుకు పరిశీలించారు. రైతు బజారంతా తిరిగి పరిశీలించారు. కూరగాయల ధరలు గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల రేట్లు తెలిపే బోర్డ్ ప్రతి షాప్ వద్ద ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ కవర్లు వాడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డిఒ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం.రామచంద్రారెడ్డి, ఎపిఎంఐపి శ్రీలక్ష్మి, టౌన్ సర్వే ఎస్.రమణయ్య, సిబ్బంది ఉన్నారు.

రహదారికి మోక్షమెప్పుడో!

గొల్లగూడెంలో స్థానికుల నిరసన

ప్రజాశక్తి - మొగల్తూరు


నిరసన ప్రదర్శన చేస్తున్న స్థానికులు

సంవత్సరాలు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారినా తమ రహదారికి మోక్షం కలగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రం మొగల్తూరు నుండి కొత్తపాలెం మీదుగా వెంప వరకు ఉన్న రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతూ మొగల్తూరు పంచాయతీ గొల్లగూడెంలో స్థానికులు రహదారిపై నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. రహదారి అభివృద్ధి చేయాలని కోరుతూ ఆదివారం నిరసన ప్రదర్శన, రిలే దీక్షలో చేసినా ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులలో స్పందన లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి పలువురు వాహనచోదకులు ప్రమాదాలు బారిన పడ్డారన్నారు. మండల స్థాయి కార్యాలయాలకు వెళ్లి దారి దుస్థితి దారుణంగా ఉండడంతో కార్యాలయానికి వెళ్లి సిబ్బంది, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారికి మోక్షం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. కార్యక్రమంలో కోరశిక వరలక్ష్మి, డొక్కు వెంకటలక్ష్మి, ముత్యాలమ్మ, కందుల నవీన్, కన్నబోయిన వంశీ, చిమిలి ఆదినారాయణ, జగదీష్, కండేటి వెంకటేష్, పట్టపు ప్రశాంత్, కోరశిక సత్యనారాయణ, కైలా రాజేష్, తోట రాజేష్ పలువురు స్థానికులు ఉన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మామిడూరు గ్రామానికి చెందిన వయోవృద్ధురాలు, గ్రామ మాజీ సర్పంచి దాట్ల సూర్యనారాయణ రాజు సతీమణి సూర్యాకాంతం(100) వృద్ధాప్య కారణంగా ఆదివారం ఉదయం మృతిచెందారు. ఆమె భర్త మాజీ సర్పంచి కరోనా కాలంలో 102 సంవత్సరాల వయస్సులో మరణించారు. ఆమెకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆమె కుమార్తెల్లో ఒకరు డాక్టర్ కలిదిండి అన్నపూర్ణ పెనుగొండలోని ఇంటర్ విద్యార్థి ... డాక్టర్ ఉల్లాసచంద్ర మెమోరియల్ హాస్పటల్ను భర్త డాక్టర్ కె.రామచంద్ర రాజుతో కలిసి గత నాలుగు దశాబ్దాలుగా నిర్వహిస్తున్నారు. సూర్యాకాంతం కుమార్తె, కుమారుడు, కుమారునితో పాటు మనుమళ్ళు, మనుమరాళ్లతో ఎక్కువ మంది వైద్య వృత్తిలో ఉన్నారు. సూర్యకాంతం అంత్యక్రియలు స్వగ్రామం పెనుమంట్ర మండలం మామిడూరులో సోమవారం ఉదయం మామిడూరు మీదుగా రాజమండ్రిలో జరుగుతాయని ఆమె మృతికి అన్ని తరగతుల ప్రముఖులు, ప్రజలు సంతాపం వ్యక్తం చేశారు.

పారా ఒలంపిక్స్లో విద్యార్థులకు బహుమతులు

ఆకివీడు : ప్రపంచ వికలాంగ దినోత్సవం సందర్భంగా భీమవరం డిఎన్ఆర్ కాలేజీలో గత రెండు రోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి పారా ఒలింపిక్స్ క్రీడా పోటీల్లో తమ విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారని స్థానిక జెడ్పి బాలుర హై స్కూల్ పిడి శ్రీరామ్ తెలిపారు. పారా ఒలింపిక్స్ లో ఇంటర్ చదువుతున్న అయ్యప్ప షాట్ పుట్లో ప్రథమ బహుమతి, రన్నింగ్లో ద్వితీయ బహుమతి, ఇంటర్ విద్యార్థి ఎన్. క్రాంతి ప్రథమ బహుమతి, రన్నింగ్లో మూడవ బహుమతి, రన్నింగ్లో ఆరో తరగతి విద్యార్థి పి.అభిషేక్ మూడవ బహుమతి, షాట్ పుట్లో ఏడవ తరగతి విద్యార్థి సాయి చరణ్ ద్వితీయ బహుమతి, ఇంటర్ విద్యార్థి నందిని రన్నింగ్, షార్ట్ పుట్లలో మూడవ బహుమతి, ఎనిమిదో తరగతి ముత్యాలరావు డిస్కస్లో ప్రథమ బహుమతి సాధించారని తెలిపారు. ఏడో తరగతి విద్యార్థి పి.సాయి రన్నింగ్లో రెండవ బహుమతి సాధించారని ఆయన చెప్పారు.

చర్మవ్యాధులపై శీతకన్నొద్దు..!

జాగ్రత్తలు తప్పనిసరి

కాళ్ల పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్

ప్రజాశక్తి - కాళ్ల



ప్రస్తుతం చలి చంపేస్తోంది. రోజురోజుకూ శీతల గాలుల తీవ్రత పెరుగుతోంది. ఆ ప్రభావంతో చర్మ రుగ్మతలు వేధిస్తుంటాయి. చర్మం పొడిబారడం, పగుళ్లు రావడం, దురదతో కూడిన ఎర్రటి మచ్చలు ఏర్పడటం వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ ఈ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. రద్దీ ప్రదేశాలు, వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు ఎక్కువగా చర్మ సమస్యలు వచ్చే అవకాశముందని కాళ్ల పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ సునీల్ వివరించారు.

ప్రశ్న : గృహిణులు పాత్రలు కడిగిన తరువాత ఏ జాగ్రత్తలు పాటించాలి?

డాక్టర్ : గృహిణులు పాత్రలు కడిగేందుకు సబ్బులు వాడతారు. ఆ పని పూర్తయిన వెంటనే చేతుల్ని శుభ్రం చేసుకుని కొబ్బరి నూనె, మాయిశ్చరైజర్ క్రీములు, ఇతర లేపనాలు రాసుకోవాలి. గ్లిజరిన్ సబ్బులు వాడాలి. గోరువెచ్చని నీటితో స్నానం చేయడం ఉత్తమం. చర్మం తేమగా ఉండేలా ప్రతి 2 గంటలకోసారి కొబ్బరి నూనె, కోల్డ్ మాయిశ్చరైజర్ క్రీములు పూసుకోవాలి. చలి తీవ్రత ఎక్కువగా ఉండే వేళల్లో వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలి. బయటకు వెళ్లేటప్పుడు పూర్తిగా చర్మాన్ని కప్పేలా ఉన్ని లేదా కాటన్ దుస్తులు ధరించాలి. సన్ స్క్రీన్ లేపనాలు వాడాలి.

ప్రశ్న : రోజుకు కనీసం ఎన్ని లీటర్ల నీరు తాగాలి?

డాక్టర్ : రోజుకు కనీసం 3 లీటర్ల నీరు తాగాలి. విటమిన్ 'సి' ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. సొరియాసిస్, తామర, దద్దుర్లు ఏర్పడితే ఇంట్లోనే సొంత వైద్యం చేసుకోకుండా తక్షణమే వైద్య నిపుణులను సంప్రదించి సలహా తీసుకోవాలి.

చిట్ - చాట్

ప్రశ్న : పిల్లలు ఏ వ్యాధులకు గురవుతుంటారు?

డాక్టర్ : ఇటీవల తుపాను ప్రభావంతో రోగుల తాకిడి పెరిగింది. చర్మం పొడిబారి తామర(ఎగ్జిమా) వస్తుంది. దురద ఎక్కువగా ఉంటుంది. గోకితే దద్దుర్లు ఏర్పడి మంట పుడుతుంది. ఎక్కువగా ఉన్న పిల్లలు ఎటోపిక్ డెర్మటైటిస్ వ్యాధికి గురికావడంతో ఎరుపు రంగు మచ్చలు వస్తాయి. సొరియాసిస్ సోకి చర్మంపై మచ్చలు ఏర్పడి పొట్టులా రాలిపోతూ దురద వస్తుంది. తలలో చుండ్రు పెరుగుతోంది. సెబోరిక్ డెర్మటైటిస్ తలలో ఏర్పడి పొట్టులా చర్మం ఊడిపోతుంది. కాళ్ల మడమలు, పెదాలు, చేతులపై పగుళ్లు వస్తాయి. చేతి మునివేళ్లు మంటగా ఉండి గుంజినట్లు అవుతాయి.

ప్రశ్న : శీతాకాలంలో చర్మ వ్యాధులపై ఏవిధమైన జాగ్రత్తలు పాటించాలి?

డాక్టర్ : చర్మ రుగ్మతలకు ప్రాథమిక దశలోనే వైద్యం తీసుకుంటే సమస్య జఠిలం కాకుండా పరిష్కరించుకోవచ్చు. నిర్లక్ష్యం చేస్తే వ్యాధి పెరుగుతుంది. సొరియాసిస్, తామర వచ్చినవారు వైద్యుల సూచనల మేరకు సక్రమంగా మందులు వినియోగించాలి. శీతాకాలంలో చర్మం ఎప్పుడూ తేమగా ఉంచుకునేందుకు ప్రయత్నించాలి.

యువత నాయకులుగా ఎదగాలి

కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

ప్రజాశక్తి - నరసాపురం

యువత సేవకులుగా ఉంటూ నాయకులుగా ఎదిగేందుకు ప్రయత్నించాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 26వ వార్డు గాంధీబొమ్మ సెంటర్ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన శెట్టిబలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకీరామ్, టిడిపి ఇన్ఛార్జి పొత్తూరి రామరాజులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సభలో మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి అనేక సేవ కార్యక్రమాలు చేశారు. విద్యకు అవసరమైన భూములను దానం చేసారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా యువత మంచి మార్గంలో ముందుకు సాగాలన్నారు. ఇటువంటి విగ్రహాలు ఏర్పాటు చేయడం వల్ల మనలో ఐక్యత మరింత పెరుగుతుందన్నారు. విద్యాపరంగా శెట్టి బలిజలు ఎదగాలన్నారు. అప్పుడే మనకు గౌరవం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో చెల్లబోయిన వాసు, గుత్తుల వాసు, జోగి పండు, పద్మారావు, గుబ్బల వేణుగోపాలరావు, బొక్క రాధాకృష్ణ పాల్గొన్నారు.

2030 నాటికి హెచ్ఐవి రహిత రాష్ట్రంగా ఎపి : మంత్రి

ప్రజాశక్తి - పాలకొల్లు

2030 నాటికి హెచ్ఐవి రహిత రాష్ట్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యాన హెచ్ఐవి బాధితులకు చేయూత కార్యక్రమంలో ఆదివారం మంత్రి పాల్గొన్నారు. హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహారం, నిత్యావసర సరుకుల బ్యాగులను మంత్రి పంపిణీ చేశారు. సమాజంలో హెచ్ఐవి బాధితుల పట్ల మానవత్వం, ప్రేమానురాగాలతో మెలగాలని, వారి పట్ల వివక్ష చూపొద్దని కోరారు. హెచ్ఐవి బాధితులకు 105 రకాల వైద్య సేవలను కూటమి ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. హెచ్ఐవి బాధితులకు సేవలందించడంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని మంత్రి చెప్పారు. హెచ్ఐవి బారిన పడినంత మాత్రాన భయపడక్కర్లేదని బాధితులను ఓదార్చారు. కూటమి ప్రభుత్వంలో 42 వేల మంది హెచ్ఐవి రోగులకు పింఛన్ అందిస్తున్నట్లు మంత్రి చెప్పారు. కూటమి నేతలు పాల్గొన్నారు.

అగ్నివీర్కు టిబిఆర్ సైనిక్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - పెంటపాడు

మండలంలోని అలంపురం గ్రామంలోని టిబిఆర్ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ఇద్దరు విద్యార్థులు ఆర్మీలోని అగ్నివీర్కు అర్హత సాధించారని కళాశాల ఛైర్మన్ టి.భోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. తమ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న వంశీ, నాగేంద్రలు అత్యంత ప్రతిభ కనబరిచి ఆర్మీ విభాగంలోకి అడుగుపెడుతున్నారని ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో తెలియజేశారు. రానున్న కాలంలో మరింత ఎక్కువ మందిని సైనికులుగా తీర్చిదిద్దే విధంగా తమ కళాశాల బృందం అకుంఠిత దీక్షతో పనిచేస్తుందని తెలియజేశారు.

12 నుంచి సెక్షన్ 30 అమలు : డిఎస్పి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం సబ్ డివిజన్ పరిధిలో ఈనెల 12వ తేదీ వరకు సెక్షన్ 30 అమలులో ఉంటుందని నరసాపురం డిఎస్పి డాక్టర్ జి.శ్రీవేద తెలియజేశారు. నరసాపురం డివిజన్ పరిధిలోని పోలీసు యాక్టు 30 అమల్లో ఉన్నందున నిరసన కార్యక్రమాలు, ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించకూడదని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు. అనుమతులు లేకుండా నిరసన, ధర్నా, సమావేశాలు నిర్వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిఎస్పి శ్రీవేద హెచ్చరించారు.

ఉచిత వైద్య శిబిరాలు పేదల పాలిట వరం

కొప్పర్రు సొసైటీ అధ్యక్షుడు అందే నరేన్

ప్రజాశక్తి - నరసాపురం


ఆపరేషన్ చేయించుకున్న గ్రామస్థులు

ఉచిత వైద్య శిబిరాలు పేదల పాలిట వరమని కొప్పర్రు సొసైటీ అధ్యక్షుడు అందే నరేన్ అన్నారు. మండలంలోని కొప్పర్రు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యాన ఉచితంగా 14 మందికి కంటి శస్త్ర చికిత్సలను చేయించి 237 మందికి కళ్లజోళ్లను నరేన్తో పాటు సొసైటీ కార్యవర్గ సభ్యులు కడలి మసేనురావు, మెర్గుమువ్వల భాస్కరరామస్వామి, సొసైటీ కార్యదర్శి దొడ్డ లక్ష్మణరావు, సిబ్బంది అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ నరేన్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పుట్టినరోజును పురస్కరించుకుని గ్రామ ప్రజల కోరిక మేరకు ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వారిచే సొసైటీ ఆధ్వర్యాన ఉచితంగా మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. కొప్పర్రు గ్రామ పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో వైద్య సేవలు పొందారని నరేన్ తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం వైద్యులు గుర్తించిన 14 మందికి శస్త్ర చికిత్సలు చేయించి 237 మందికి కళ్లజోళ్లను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ సేవాభావంతో ఉండాలన్నారు. సేవలో ఉన్న తృప్తి మరెందులోను ఉండదని నరేన్ తెలిపారు. కంటి వైద్య శిబిరాన్ని విజయవంతం చేసిన పరిసర గ్రామాల ప్రజలకు, సొసైటీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, గ్రామ పెద్దలకు నరేన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

టిడ్కో గృహాల బ్యాంకు రుణమాఫీ చేయాలి

ఐద్వా ఆధ్వర్యాన మహిళల రాస్తారోకో

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా నేతలు

తాడేపల్లిగూడెం టిడ్కో గృహాల బ్యాంకు రుణమాఫీ చేయాలని, కనీస అవసరాలు తీర్చాలని, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని ఐద్వా ఆధ్వర్యాన ఆదివారం మహిళలు బయటకు వచ్చి ర్యాలీ నిర్వహించి రోడ్డుమీద రాస్తారోకో చేశారు. ఈ ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ పాల్గొని ఎ బ్లాక్లో వాళ్లందరికీ రుణమాఫీ జరిగిందని, అదేవిధంగా రుణమాఫీ చేయాలని వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు బ్యాంకు రుణాలు కడుతుంటే టిడిపి ప్రభుత్వం అడ్డుకుందని, ఈరోజున మళ్లీ వీళ్లే బ్యాంకు రుణాలు కట్టమంటున్నారన్నారు. రికవరీ బాయ్స్ వచ్చి మహిళల మీద అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, వీటిని అడ్డుకోవాలని, తమకు రుణమాఫీ చేయాలని, కనీస అవసరాలు తీర్చాలని, పాముల బెడదను తగ్గించాలని, చెత్తను ఎత్తివేయాలని, ఈ రుణమాఫీ, కనీస అవసరాలు తీర్చే వరకు మహిళలు చేసే పోరాటానికి అండగా ఉంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బి.యశోద, మండల కార్యదర్శి పి.సత్యవతి, ఎం.పావని, మహిళలు పాల్గొన్నారు.

రైతులపై మిల్లర్ల దోపిడీ

ఎపి కౌలురైతుల సంఘం విమర్శ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ధాన్యం తూకాల్లో ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు నిర్ణయించిన విధానాన్ని క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు ప్రచారం చేసి రైతులకు అవగాహన కల్పించకుండా నిర్లక్ష్యంగా వదిలి వేయడంతో, మధ్యవర్తులు, మిల్లర్లు అయిన కాడకి దోచుకున్నారని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. ధాన్యం కొనుగోలులో వస్తున్న సమస్యలను పరిశీలించేందుకు ఆదివారం పాలకొల్లు మండలంలో పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అరట్లకట్ట, పి.పోలవరం గ్రామాల్లో ధాన్యం తూకాలు పరిశీలించారు. నలభై కేజీల సంచి బరువు కేవలం 450 గ్రాములోస్తే సంచి బరువు కింద కేజీ 200 గ్రాములు తూస్తున్నారని తెలిపారు. దీంతో ప్రతీసారీ మూటకి అదనంగా 700 గ్రాముల ధాన్యం రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సంచి కింద 600 గ్రాములే తూయాలని రైతుసేవా సిబ్బంది ఎవరూ చెప్పడం లేదని రైతులు తెలిపారన్నారు. క్షేత్రస్థాయిలో రైతుసేవా అధికారులెవ్వరూ రైతులకు ప్రచారం చేయడం లేదని, కనీసం సంచి ఎంత బరువు వస్తుందో అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. మరికొంత మంది మధ్యవర్తులు మిల్లర్లతో కుమ్మక్కై అదనంగా ధాన్యం తూస్తేనే, ధాన్యం పడతామని చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. సమస్యపై తక్షణం రైతుసేవా సిబ్బంది రైతులకు అవగాహన కల్పించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ధాన్యం తూకాల్లో మోసాలు అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలురైతులు, రైతులు దిగమర్తి అబ్బులు, గరగ వెంకటేశ్వర్లు, దిగమర్తి సరస్వతి, మామిడిశెట్టి రాంబాబు, పాల్గొన్నారు.

అందుబాటులోకి డయాలసిస్ సెంటర్లు

కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ

ప్రజాశక్తి - భీమవరం టౌన్


శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ

ప్రజలకు అత్యవసర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ప్రత్యేకంగా కృషిచేసి తీసుకువచ్చిన సిఎస్ ఆర్ నిధులతో భీమవరం, ఆచంటలో అత్యాధునిక ప్రభుత్వ డయాలసిస్ విభాగాల నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. రెండు చోట్ల నిర్మాణ పనులను కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమవరంలో ఏర్పాటు చేసిన సభలో కేంద్రమంత్రి మాట్లాడుతూ జిల్లాలో భీమవరం విద్య, వైద్య రంగాల్లో ముందున్నప్పటికీ ప్రభుత్వ రంగంలో డయాలసిస్ సెంటర్ లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రయివేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోలేక పేషెంట్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సమస్య తన దృష్టికి వచ్చిందని, అందుకే అత్యవసర వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చి ఈ సెంటర్ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సెంటర్ ఆరు నెలల్లో అందుబాటులోకి రానుందని, అత్యాధునిక డయాలసిస్ యంత్రాలతో కూడిన 10 బెడ్లను డయాలసిస్ రోగులకు ఉచిత చికిత్స కోసం అందుబాటులోకి వస్తాయని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ ప్రకటించారు. అవసరాన్ని బట్టి అదనపు బెడ్లను కూడా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. భీమవరం ఎంఎల్ఎ, పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) మాట్లాడుతూ భీమవరంలో ప్రభుత్వ డయాలసిస్ సెంటర్ లేకపోవడంతో డయాలసిస్ పేషెంట్లు చికిత్స కోసం తాడేపల్లిగూడెం, తణుకు, ఏలూరు వెళ్లవలసి వస్తుందని, ప్రయాణంలో వారు పడుతున్న బాధ వర్ణనాతీతమని తెలిపారు. అత్యాధునిక డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మణ్, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు పాల్గొన్నారు.

ఆచంటలోని సిహెచ్సి ప్రైమరీ సెంటర్ వద్ద కోటి రూపాయలతో డయాలసిస్ విభాగం నిర్మాణ పనులను కేంద్రమంత్రి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ నాగరాణి పాల్గొన్నారు.

సాగరతీరం.. కోలాహలం

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం సౌత్, కేపీ పాలెం సౌత్ గ్రామాల్లో విస్తరించి ఉన్న బీచ్ ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. గత కొన్ని వారాలుగా తుపాను ప్రభావంతో బీచ్కి అధికారులు పర్యాటకులను అనుమతించలేదు. ఈవారం వాతావరణం అనుకూలంగా ఉండడంతో సుదూర ప్రాంతాల నుండి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాలలో బీచ్కు తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటలలో సహపంతి భోజనాలు చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆహ్లాదంగా గడిపారు.


సముద్ర కెరటాలలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

స్వాతంత్రోద్యమంలో చురుకైన పాత్ర

తాడేపల్లి ముసలయ్య, కృపమ్మ వర్ధంతిలో వక్తలు

ప్రజాశక్తి - పెంటపాడు

స్వాతంత్ర సమరయోధులు, మాజీ పిసిసి ప్రెసిడెంట్, కీర్తిశేషులు తాడేపల్లి ముసలయ్య 27వ వర్ధంతి, రిటైర్డ్ టీచర్ తాడేపల్లి పెద్ద కృపమ్మ 26వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం పెంటపాడులోని వారి పెద్ద కుమారుడు తాడేపల్లి మోహన్రావు రిటైర్డ్ ఆంధ్రబ్యాంక్ సీనియర్ మేనేజర్ స్వగృహంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మంది వృద్ధులకు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా పెంటపాడు పారిశుధ్య కార్మికులకు 50 జాకెట్స్ అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామాంజనేయరాజు హాజరుకాగా, ఎంఇఒ-1 శ్రీనివాస్, ఎంఇఒ-2 టివి.రామకృష్ణ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు తాడేపల్లి ముసలయ్య క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొని దాదాపు 18 నెలల పాటు జైలు జీవితం గడిపిన చారిత్రాత్మకమైన జీవితం వారిదన్నారు. రాజకీయంగా అంచలంకెలుగా ఎదుగుతూ మాజీ పిసిసి ప్రెసిడెంట్ గాను, మాజీ ఎంఎల్సి, మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్, తాడేపల్లిగూడెం మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్గా అనేకమైన ఉన్నతమైన పదవులు అధిరోహించిన ఘనత తాడేపల్లి ముసలయ్యదని తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షులు చీకటిపల్లి మంగరాజు, గుంపుల సత్యకృష్ణ, మానవత సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

ట్రస్ట్ బోర్డ్ సభ్యుల ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - ఆకివీడు

తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతలు నెరవేరుస్తానని భీమేశ్వర స్వామి దేవస్థానం నూతన ఛైర్మన్ వేమూరి వెంకట సీతారామశాస్త్రి చెప్పారు. స్థానిక మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి దేవస్థానం నూతన ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, ఛైర్మన్లు చేత ఆదివారం దేవస్థానం ఇఒ అల్లూరి వెంకట సత్యనారాయణ రాజు పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ట్రస్ట్ బోర్డు సభ్యులుగా చింత ఆదిశేషు, చుండూరు వెంకటేశ్వరరావు, పొదిని రాంబాబు, తీపర్తి చంద్రకుమారి, జంగారెడ్డి కొండారెడ్డి, మైపాల శ్రీదేవి, నక్కిని శ్రీలక్ష్మి, మాడుగుల దుర్గ భవానిలతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యులుగా దేవస్థానం అర్చకులు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఛైర్మన్గా ఎన్నికైన సీతారామశాస్త్రి అధికార బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు మోటిపల్లి రామవరప్రసాద్, పెద్దింటమ్మ దేవస్థానం ట్రస్టు ఛైర్మన్ గుంట్ల గణపతి, కట్ రెడ్డి ఏడుకొండలు, ఎస్బిఎన్.శాస్త్రి మాట్లాడారు.

జిల్లా కేంద్రంగా నరసాపురాన్ని ప్రకటించాలి

నరసాపురం వ్యాపార అసోసియేషన్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ రాజేంద్ర లయన్స్ క్లబ్లో ఆదివారం వివిధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నరసాపురం నియోజకవర్గం రైతు ప్రజా పోరాట నాయకులు కూనపురెడ్డి వీర వెంకట విజయ రంగారావు, మాజీ కౌన్సిలర్ చెన్న రమేష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ చినిమిల్లి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అన్ని హంగులతో ఉన్న నరసాపురంను కాదని స్వార్థ రాజకీయ పూరితంగా భీమవరంను ప్రకటించారన్నారు. ఈమధ్యకాలంలో మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు, విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యాన ఇదే విషయాన్ని నరసాపురంను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ అమరావతిలోని రాష్ట్ర కమిటీకి వినతి పత్రం అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో కలువకొలను తాతాజీ, చౌక డిపో అసోసియేషన్ అధ్యక్షుడు అధికారి ఏసు, న్యాయవాది సోడదాసి శ్రీధర్, నాయకులు వనమాల శ్రీనివాసరావు, అందే రంగారావు, దొండపాటి స్వాములు, పట్టణ ప్రముఖులు అందే రామ్ సతీష్, కోటిపల్లి సురేష్ పాల్గొన్నారు.

ముగిసిన ఆక్యుపంచర్ వైద్య శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం

రాయల్ క్లబ్ వశిష్ట సేవలు ప్రశంసనీయమని కొప్పర్రు శ్రీసీతారామాలయ దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ పోలిశెట్టి గణేశ్వరరావు అన్నారు. స్థానిక మహిళా సంఘం భవనంలో గత రెండు రోజులుగా రాయల్ క్లబ్ వశిష్ట అధ్యక్షులు జక్కం బాబ్జి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఆక్యుపంచర్ వైద్య శిబిరం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గణేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాయల్ క్లబ్ వశిష్ట ఆధ్వర్యాన చిట్టవరం జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం, సామాజిక సేవలో భాగస్వాములుగా ఉన్న పాత్రికేయులను సన్మానించడం, ఉచిత ఆక్యుపంచర్ వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆక్యుపంచర్ వైద్యురాలు అరుంధతిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంటి ప్రభాకర్ ఉన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎస్ పరీక్ష

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని ఐదు సెంటర్లలో ఆదివారం ఎన్ఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్) పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఇఒ పుష్పరాజ్యం తెలిపారు. ఈ పరీక్షలకు 1116 మంది హాజరుకావాల్సి ఉండగా 1083 హాజరయ్యారు. 33 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అన్ని కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించారు. తరుచూ కేంద్రాల వద్ద స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు.

సీనియర్ న్యాయవాది నాగిరెడ్డి చిత్ర పటం ఆవిష్కరణ

ప్రజాశక్తి - నరసాపురం

సీనియర్ న్యాయవాది దొంగ నాగిరెడ్డి చిత్ర పటాన్ని హై కోర్టు న్యాయమూర్తి టి.మల్లిఖార్జునరావు ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక తెలగ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రాల్లో నరసాపురం బార్ అసోసియేషన్కు మంచి పేరుందని, విశేష ప్రతిభ కనబరిచిన సీనియర్ న్యాయమూర్తులు, న్యాయవాదులు నరసాపురంనకు చెందిన వారు ఉన్నారని తెలిపారు. సీనియర్ న్యాయవాదులను స్మరించే విధంగా, వారి సేవలు గుర్తుకు తెచ్చే విధంగా వారి ఫొటోలను బార్ అసోసియేషన్ హాల్లో ఏర్పాటు చేసుకోవడం మంచి సంప్రదాయమని, ఈ సాంప్రదాయాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. మరో అతిథి హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, బార్ కౌన్సిల్ సభ్యులు, సీనియర్ న్యాయ వాది కె.చిదంబరం మాట్లాడుతూ న్యాయ వ్యవస్థకు నరసాపురం అవినాభావ సంబంధం ఉందన్నారు. న్యాయ సేవలో నరసాపురంనకు విశిష్ట స్థానం ఉందన్నారు. నాగిరెడ్డి చిత్ర పటంను ఏర్పాటు చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో న్యాయవాదులు దొంగ సుభాష్, దొంగ మంగ తాయారు, పుల్లాజీ పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలకు శిక్షణ

పాలకొల్లు : టిడిపి అంటే రాష్ట్రంలో లక్షలాది మంది క్రమశిక్షణ గల కార్యకర్తలతో నడుస్తున్న పార్టీ అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల చెప్పారు. పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాల్లో కార్యకర్తల ఎంపవర్మెంట్పై మంత్రి ఆదివారం ప్రసంగించారు. రాష్ట్రంలో 6 నియోజకవర్గాల్లో ఈ శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయని దానిలో పాలకొల్లు ఒకటన్నారు. కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.